ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physics), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 130 మంగళవారం 13-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 7 వెల : 5 రూ/..

## 3లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

### రాష్ట్రంలో లక్షకుపైగా ఉద్యోగాలు సృష్టించాం

- సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు ప్రోత్సాహం - ఆర్థిక అభివృద్ధి కోసం పరిశ్రమలకు మద్దతు
- నానక్‌రాంగూడలో సొనాటా ఏఐ కేంద్రాన్ని - ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 12:** తెలంగాణ రాష్ట్రానికి 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు కొత్తగా రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లక్షకు పైగా ఉద్యోగాలు సృష్టించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశీయంగా, అంతర్జాతీయంగా పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. మూడు దశాబ్దాలుగా హైదరాబాద్‌లోని బేగంపేట కేంద్రంగా ఉన్న సొనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఐటీ కారిడార్‌కు విస్తరించింది. నానక్‌రాంగూడలోని వంశీరాం సువర్ణదుర్గ టెక్ పార్క్‌లో 2లక్షల చదరపు అడుగుల్లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. నూతన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొనాటా సాఫ్ట్‌వేర్ ఏఐను ఉపయోగించి పర్యావరణ వ్యవస్థలను రూపొందించడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ మహానగరం సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)కి హబ్‌గా మారిందని పేర్కొన్నారు. అలాగే ఏఐ-రెడీ డేటా సెంటర్లు, తయారీ రంగాలకూ హైదరాబాద్ కేంద్రంగా మారిందని తెలిపారు. మైక్రోసాఫ్ట్, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, విప్రో వంటి ఐటీ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోని తమ క్యాంప్‌సలను విస్తరిస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తూనే.. పరిశ్రమలకు మద్దతు ఇస్తూ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర ఓడరేవుతో అనుసంధానించేందుకు ఇక్కడ డ్రైపోర్ట్ నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో ఏఐ నగరం, యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**ప్రతీ కంపెనీ హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్**

ప్రపంచంలోనే గొప్ప ఈవెంట్లలో ఒకటిగా పేరుపొందిన మిస్ వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతుండడం మనందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మరిన్ని ప్రపంచ ఈవెంట్లను తెలంగాణలో నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ కార్యాచరణ ద్వారా ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సమతుల్యంగా సాగుతోందని, ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా ఎదగడంలో, హైదరాబాద్‌ను అత్యద్భుత నగరంగా మార్చడంలో అందరి సహకారం కోరుతున్నామని చెప్పారు. ఇక్కడి ప్రతీ కంపెనీ హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసడర్లుగా మారాలని, మన విజయాలను ప్రపంచానికి చూపాలని ఆయన అన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఏఐ, మెషిన్ లెర్నింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీసలో ప్రపంచంలోనే తెలంగాణను లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణను ఏఐ లీడర్‌గా మార్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించామని చెప్పారు. ఏఐ సిటీకి శ్రీకారం చుట్టామని, ఈ సిటీలో భాగస్వామయేందుకు మైక్రోసాఫ్ట్ లాంటి టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏఐలో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు జూన్ లేదా జూలై నెలలో ఏఐ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామన్నారు. పౌర సేవలను ఏఐతో అనుసంధానించి ప్రజల ముంగిట చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## అణ్వస్త్ర బెదిరింపులను సహించం

### ఉగ్రవాదులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రభుత్వాల్ని వేర్వేరుగా చూడం

- నుదుట సిందూరాన్ని తుడిచే సాహసం చేస్తే వాటి
- ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశాం
- సరిహద్దుల్లో దాడికి సిద్ధమైతే..
  పాక్ గుండెలపైనే దాడులు చేశాం
- భద్రతా బలగాల తెగువ, పరాక్రమం తిరుగులేనివి
- ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే బాటలో పయనించలేవు..
- రక్తం, నీళ్లు కలిసి ప్రవహించ లేవు..
- జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో
  ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ, మే 12:** అణు బెదిరింపులకు భారత్ బెదిరేది లేదని, అణ్వస్త్ర బ్లాక్ మెయిలింగ్‌ను ఏమాత్రం సహించేది లేదని పాకిస్థాన్‌కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తేల్చి చెప్పారు. అణ్వస్త్ర బూచిని చూపించి ఉగ్రవాద స్థావరాలను నిర్వహిస్తే కచ్చితమైన, నిర్ణయాత్మక దాడులు తప్పవని హెచ్చరించారు. ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి మధ్య ఏమాత్రం తేడా లేదని, ఉగ్రవాద నాయకులను, వారికి ఆశ్రయం ఇచ్చే ప్రభుత్వాలను భారత్ వేర్వేరుగా చూడదని పునరుద్ఘాటించారు. భారత సైన్యం హతమార్చిన ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ సైనికాధికారులు హాజరయ్యారని, దీనిని ప్రపంచమంతా చూసిందని, ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదంలో పాకిస్థాన్ పూర్తిగా కూరుకుపోయిందనడానికి ఇది మరో నిదర్శనమని చెప్పారు. మన కుమార్తెలు, చెల్లెళ్ల నుదుటిపై సింధూరాన్ని తుడిచే సాహసాన్ని ఉగ్రవాదులు చేశారని, దానికి ప్రతిగా ఉగ్రవాదం ప్రధాన కార్యాలయాలనే తుడిచిపెట్టేశామని, దాంతో, సిందూరాన్ని తుడిచేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఇప్పుడు ప్రతి ఉగ్రవాదికి తెలిసిందని అన్నారు. మన సరిహద్దుల్లో దాడులు చేయడానికి పాకిస్థాన్ సిద్ధమైందని, కానీ, భారత్ మాత్రం నేరుగా దాని గుండెలపైనే తన్నిందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరును ఆపరేషన్ సిందూర్ పునర్ నిర్వచించిందని, సరికొత్త బెంచ్ మార్క్‌ను నిర్దేశించిందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లో భారత్ సృష్టించిన యుద్ధ బీభత్సానికి తట్టుకోలేక ఆ దేశం కాళ్ల బేరానికి వచ్చిందని, మరోసారి ఉగ్రవాదానికి పాల్పడబోమని చెప్పిందని, అందుకే తాము కూడా కాల్పుల విరమణకు అంగీకరించామని చెప్పారు. పాకిస్థాన్‌లో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడంపైనేనని తేల్చి చెప్పారు. ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి జరగవని, ఉగ్రవాదం, వాణిజ్యం ఒకే బాటలో సాగవని, రక్తం, నీళ్లు ఒకేసారి ప్రవహించవని స్పష్టం చేశారు. పహల్గాంలో ఉగ్ర దాడి.. అనంతరం ఉగ్రవాదుల పీచమణచడానికి భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గంటలకు ఆయన జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే... ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక్క పేరు మాత్రమే కాదు.. అది కోట్లాదిమంది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక. న్యాయం జరగాలని చేసిన దృఢమైన సంకల్పం. దీనినే ఈనెల ఆరేడు తేదీల్లో ప్రపంచం మొత్తం చూసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, శిక్షణ శిబిరాలపై మన సైనిక బలగాలు కచ్చితమైన దాడులు చేశాయి. వాటిని తిరుగులేని దెబ్బతీశాయి. భారత్ ఇంత సాహసోపేతమైన అడుగులు వేస్తుందని ఉగ్రవాదులు ఎన్నడూ ఊహించి ఉండరు. కానీ, మాకు దేశమే తొలి ప్రాధాన్యమనే సంకల్పంతో జాతి మొత్తం ఏకమైంది. దృఢమైన నిర్ణయాలు తీసుకున్నాం. ప్రభావశీల ఫలితాలు వచ్చాయి.

## మార్చి నెలలో వాణిజ్య పన్నుల వృద్ధి 6 శాతం

### క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం



హైదరాబాద్, మే 12: గడిచిన సంవత్సరం మార్చి నెలతో పోలిస్తే.. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చి నెలలో వాణిజ్య పన్ను వసూళ్లలో 6 శాతం మేర వృద్ధి నమోదైందని, ఇది మంచి పరిణామమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయ వనరుల సమీకరణపై క్యాబినెట్ సబ్ కమిటీ సచివాలయంలో భట్టి అధ్యక్షతన సమావేశమైంది. ఇందులో కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. గడిచిన ఏడాది(2023-24) మార్చి లో వసూలైన జీఎస్టీ, వ్యాట్ కంటే ఈసారి మార్చిలో రూ.600 కోట్ల వృద్ధి ఉంటుందని అంచనా వేయగా.. రూ.500 కోట్ల ఆదాయం ఖజానాకు సమకూరిందని తెలిపారు.

## పది ఉపగ్రహాలతో నిత్యం పహారా: ఇస్రో




**ఇంఫాల్, మే 12:** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో దేశ ప్రజల భద్రత, రక్షణ నిమిత్తం కనీసం పది ఉపగ్రహాలు ఆకాశంలో నిరంతరం పహరా కాస్తున్నాయని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. మణిపూర్‌లోని ఇంఫాల్‌లో జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ (సీఏయూ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల మధ్య దేశ భద్రత కోసం ఇస్రో చేస్తున్న కృషిని వివరించారు. 'మన ఇరుగు పొరుగు దేశాల గురించి అందరికీ తెలుసు. మన దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ఉపగ్రహాలతో నిత్యం నిఘా పెట్టాలి. 7 వేల కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతాలను పర్యవేక్షించాలి. మన ఉత్తర భాగాన్నంతా నిరంతరం పరిశీలించాలి. ఉపగ్రహాలు, డ్రోన్ల సాయం లేకుండా దాన్ని సాధించలేం' అని నారాయణన్ అన్నారు.

## సమాచార హక్కు కమిషనర్లుగా నలుగురు

- పీవీ శ్రీనివాస్, అయోధ్యరెడ్డి, భూపాల్, పర్వీన్‌ల నియామకం
- మూడేళ్ల పాటు పదవుల్లో.. హరిప్రసాద్, కేఎల్ఎన్, వైష్ణవికి నో
- రాములు స్థానంలో భూపాల్‌కు చాన్స్
- గవర్నర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. ఆ వెంటనే ఉత్తర్వుల విడుదల



**హైదరాబాద్, మే 12:** వివిధ రంగాలకు సంబంధించిన నలుగురిని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు(ఎసఐసీ)గా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నియమించారు. జర్నలిస్టులు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లను ఎస్ఐసీలుగా నియమించేందుకు సోమవారం ఆమోదముద్ర వేశా రు. ఆ వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కమిషనర్ల నియామక ఉత్తర్వులను జారీచేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు. ఇప్పటికే రాష్ట్ర సమాచార హక్కు ప్రధాన కమిషనర్‌గా ఐఎఫఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని నియమించిన విషయం తెలిసిందే. ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్లుగా ఏడుగురిని నియమించాలని ప్రభు త్వం మొదట్లో నిర్ణయించింది. పీవీ శ్రీనివాసరావు, కప్పర హరిప్రసాద్, వైష్ణవి, కేఎల్ఎన్ ప్రసాద్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, రాములు, మొహిసినా పర్వీన్.. ఇలా ఏడుగురి పేర్లను ప్రతిపాదిస్తూ గరవ్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఫైలును పంపించింది. ఇందులో కొంత మందిపై గవర్నర్‌కు ఫిర్యాదులు రావడంతో.. ప్రభు త్వం నలుగురి పేర్లను ఖరారు చేసింది. ముగ్గురిని గవర్నర్ తిర్కరించగా.. ఒకరి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించారు. కప్పర హరిప్రసాద్ తన దరఖాస్తులో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ప్రచార కార్యదర్శి అని పేర్కొనడంతో ఆయనను తిరస్కరించినట్లు తెలిసింది. సాధారణంగా న్యాయశాస్త్రం, శాస్త్ర సాంకేతికం, సామాజిక సేవ, జర్నలిజం, మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో నిష్ణాతులను ఆర్‌టీఐ రాష్ట్ర కమిషనర్లుగా నియమిస్తారు. కప్పర హరిప్రసాద్ తాను కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అని పేర్కొనడంతో.. పార్టీ అనుబంధ వ్యక్తిగా భావించి, ఆయన పేరును తిరస్కరించినట్లు సమాచారం. వైష్ణవికి సామాజిక సేవానేపథ్యం లేనందున తిరస్కరించారు. కేఎల్ఎన్ ప్రసాద్ కోదాడలో ఎన్నికల్లో పోటీ చేశారని, అందుకే తిరస్కరించారని రాజ్‌భవన్ వర్గాల ద్వారా తెలిసింది. న్యాయవాది రాములు పేరు పరిశీలనకు వచ్చినా.. ఆయన స్థానంలో మరో న్యాయవాది, కొడంగల్‌కు చెందిన దేశాల భూపాల్‌కు అవకాశం కల్పించారు. ఇలా ముగ్గురి పేర్లను రాజ్‌భవన్ తిరస్కరించగా.. రాములు స్థానంలో భూపాల్‌కు అవకాశమిచ్చింది. వాస్తవానికి ఆర్‌టీఐ కమిషనర్ల నియామకానికి సంబంధించిన ఫైలును పక్షం రోజుల కిందటే ప్రభు త్వం రాజ్‌భవన్‌కు పంపించింది. ఫిర్యాదుల నేపథ్యం లో నియామకాల్లో ఆలస్యం జరిగింది. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని యుద్ధ వాతావరణ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రత పరిస్థితిని గవర్నర్‌కు వివరించారు. ఇదే సందర్భంలో ఆర్‌టీఐ కమిషనర్ల గురించి చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి వివరణ ఇచ్చిన కొంత సేపటికే.. ఆర్‌టీఐ కమిషనర్ల నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి.

## యుద్ధం అంటే.. బాలీవుడ్ సినిమా కాదు

### దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

### ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె వ్యాఖ్యలు



పుణె, మే 12: భారత్, పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రశ్నలు వస్తున్న నేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం అనేది రొమాంటిక్ లేదా బాలీవుడ్ సినిమా కాదన్నారు. పిల్లలతో సహా ప్రియమైన వారిని కోల్పోవాల్సి వస్తుందని, ఆ ఆవేదన తరతరాలు వెంటాడుతుందన్నారు. దౌత్యానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నరవణె కాల్పుల విరమణ ఒప్పందంపై మాట్లాడారు. 'నాకు ఆదేశాలు వస్తే.. తప్పకుండా యుద్ధానికి వెళ్తా. కానీ, దౌత్యమార్గమే నా ప్రథమ ప్రాధాన్యంగా ఉంటుంది' అని పేర్కొన్నారు. 'యుద్ధం లేదా హింస ఏదైనా చివరి అవకాశంగా మాత్రమే ఉండాలి. అందుకే మన ప్రధాని ఇది యుద్ధాల యుగం కాదని చెబుతుంటారు. బుద్ధి లేని వ్యక్తులు మనపై యుద్ధాన్ని బలవంతంగా రుద్దినప్పటికీ, మనం దాని కోసం ఉత్సాహంగా ఉండకూడదు' అని జనరల్ నరవణె అన్నారు.

## రైతులు కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు

### రెవెన్యూ ఆఫీసుల్లోనే సమస్యలకు పరిష్కారం: పొంగులేటి

**హైదరాబాద్, మే12:** రైతులు ఏ కోర్టు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో భూభారతి చట్టం తెచ్చిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం సులువైన మార్గం అని చెప్పారు. భూభారతి చట్టం ప్రయోగాత్మకంగా అమలు చేసిన తొలి దశ నాలుగు మండలాలకు సంబంధించిన జిల్లాల కలెక్టర్లతో సోమవారం సచివాలయం నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని నారాయణపేట, ఖమ్మం, కామారెడ్డి, ములుగు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని.. ఈ నెలాఖరు నాటికి పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తహసీల్దార్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మరోవైపు.. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎప్పటికప్పుడు అర్హుల జాబితాలను ఆయా జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు పంపించి ఆమోదం తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 47 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అందుబాటులో ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమల్లోకి తెస్తామన్నారు.

# ఎస్ఎస్సి ఫలితాల్లో గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు గౌరవం

## ఝాన్సీ రాజేందర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో - చీఫ్ గెస్ట్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం తొర్రూరు మే 12**

గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే శశి రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి 550 మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు సన్మానం ఏర్పాటు చేసినారు వారి చేతులమీదుగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పెద్ద వంగర విద్యార్థి నులకు కొడకండ్ల మండలంలో గల పద్మశాలి భవనంలో ఈ సంవత్సరం పదవ తరగతిలో 550 కి పైగా మార్కులు సాధించినటువంటి ఐదుగురు విద్యార్థులకు వర్షిని, కోమలత, అక్షయ,దీక్షిత,హారిక విద్యార్థులకు ఎమ్మెల్యే గారి చేతులమీదుగా సన్మానం చేయడం జరిగినదిపదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిమ కనబరిచిన 140 మంది విద్యార్థులను గుర్తించి వారికి ఘనంగా సత్కరించారు ప్రత్యేకంగా విద్యార్థులను ప్రోత్స హిస్తూ మాట్లాడారు పల్లెల్లో చదువుతున్న పట్టుదలతో చదువుకుంటూ ఉన్నత ప్రతిభ కనబరుస్తూ విద్యార్థులను సత్కరించడం అనేది ఒకసారి బాధ్యత ఎలాంటి కార్యక్రమాల వల్ల చదువులోనే కాక జీవితంలో విజయం సాధించాలని స్ఫూర్తి విద్యార్థులకు కలుగుతుంది అని ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రస్తుతం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినంద నలు కాస్తవ వ్యాప్తంగా ఇలాంటి ఆదర్శ కార్యక్రమాలు విస్తరించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# వడదెబ్బతో రైతు మృతి

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో కుప్పకూలిన రైతు



**తొలి సమయం పెద్దవంగర మే 12**

పెద్ద వంగర మండలంలోని పోచంపల్లి గ్రామంలో రైతు గండ్లకుంట గుగులోతు కిషన్ 51 ఐకెపి సెంటర్లో వడ్లు పడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిన రైతు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడదెబ్బతో మృతి చెందిన రైతుమే నెల అయిపోవడానికి వస్తున్నా కానీ నేటి వరకు ఐకెపి సెంటర్లలో ధాన్యం బస్తాల కొరత లారీలు సరైన సమయానికి రాకపోవడం చేయకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కావున ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు పట్టించుకోని రైతులు పండించిన పంటను తక్షణమే కొనుగోలు చేయాలని రైతులు కోరుచున్నారు

# గుగులోత్ కిషన్ మృతికి ప్రగాఢ సానుభూతి

## పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి పరామర్శ



**తొలి సమయం పెద్ద వంగర మే 12**

పెద్దవంగర మండలం, గుంట్లకుంటా గ్రామం, రామోజీ తండాలో నివసించే గుగులోత్ కిషన్ (వయస్సు 70) మృతిచెందిన విషయం తీవ్ర విచారకరమైనది. ఈ వార్తను తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి తక్షణమే గ్రామానికి వెళ్లి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు..గుగులోత్ కిషన్ మృతదేహాన్ని సందర్శించిన , ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబ సభ్యుల బాధను తనది చేసుకుని మాట్లాడిన , కిషన్ గారి మృతి బాధాకరం. ఈ విషాద సమయంలో మీరు ధైర్యంగా ఉండాలని కోరుతున్నా. మీకు మేము ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం, అని తెలిపారు..ఈ సందర్భంగా వారు తక్షణ ఆర్థిక సహాయంగా వారి కుటుంబానికి నగదు అందజేశారు. కిషన్ గారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.. ఝాన్సి రెడ్డి వెంట.. స్థానిక నాయకులు, మరియు పలువురు గ్రామస్తులు వారు పాటు ఉన్నారు. పేదల పక్షంలో ఎప్పుడూ నిలిచే నాయకురాలిగా ఝాన్సి రాజేందర్ రెడ్డి మరోసారి తమ మానవతా విలువల్ని చాటుకున్నారు..

# విలేజ్ డెకాయిట్ కమిటీలుగా మారిన విడిసిలపై న్యాయ పోరాటం

## ఐ.ఎల్.పి.ఎ నిజ నిర్ధారణ బృందం

**తొలి సమయం వరంగల్ మే 12:**

గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతూ విలేజ్ డెకాయిట్ కమిటీలుగా మారిన వి.డి.సి లపై న్యాయ పోరాటం చేస్తామని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ బృంద నాయకులు పొన్నం దేవరాజ్ గౌడ్, శాంసన్, వి ఎం కృష్ణ, సాయిని నరేందర్, అనంత ఆంజనేయులు, రాజారామ్, సుమలత, కందుకాల సురేష్, వెంకటేష్ ప్రసాద్, రాజశేఖర్ లు తెలిపారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడు మండలం తాళ్ళరాంపూర్ లో భారత్ ముక్తి మోర్చా నాయకులు రాజేష్ రక్షక్ అధ్యక్షతన సోమవారం జరిగిన నిజ నిర్ధారణ సమావేశంలో వారు పాల్గొని బాధిత ప్రజల నుండి వివరాలు తెలుసుకొని మాట్లాడారు. మోర్తాడ్ మండలంలో వి.డి.సి నాయకులు గత సంవత్సరం కాలంగా ఎన్నో దౌర్జన్యాలకు పాల్పడుతూ అణగారిన ప్రజలను సంఘ బహిష్కరణలు చేసి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. గత సంవత్సర కాలం నుండి తాళ్ళరాంపూర్ లో ఆధిపత్య కులాల వారు వి డి సి పేరుతో భూమి సమస్యను సృష్టించి, గౌడ కులస్తులను తాళ్ళు ఎక్కాలని బలవంతం చేశారని, తాళ్ళు ఎక్కకుంటే ఐదు లక్షల రూపాయల అపరాధ రుసుము చెల్లించాలని ఒత్తిడి చేశారని వాపోయారు. పెనాల్టీ కట్టనందుకు గౌడ కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారని, తాటి చెట్లను, ఈత వనాన్ని తగలబెట్టి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. వి.డి.సి నాయకులు అంతటితో ఆగకుండా శ్రీరామ నవమి రోజున నవమి ఉత్సవాల్లో పాల్గొన్న గౌడ మహిళలను ఆ ఉత్సవాల నుండి అగౌరవంగా బహిష్కరించి అవమానించారని బాధిత మహిళలు తెలిపారు. వి.డి.సి ల దౌర్జన్యాలపై గత మూడు నెలల నుండి పోలీసులకు ఎన్ని పిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వి.డి.సి నాయకులు అందరూ ఆధిపత్య కులాల వారైనందునే వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. జనబలం కలిగిన ఆధిపత్య కులాల దౌర్జన్యాలకు చిన్న కులాల వారు ఎన్నో బాధలు పడుతున్నారని, వి.డి.సి పేరున ఆధిపత్య కులాల వారు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ప్రకటనలకే పరిమితమవుతున్నారని, స్థానిక ఎమ్మెల్యే ఇతర నాయకులు ఎవరూ కూడా స్పందించడం లేదని అన్నారు. ఈ సందర్భంగా ఐ.ఎల్.పి.ఎ బృంద నాయకులు మాట్లాడుతూ వి.డి.సి దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాడాలని, జనబలం కలిగిన కులాల ఆధిపత్యం పోవడానికి న్యాయ పోరాటం చేయాల్సిన అవసరముందని అన్నారు. ఏక కాలంలో సామాజిక, రాజకీయ, న్యాయ పోరాటం చేయాలని, ప్రజా సంఘాల



నాయకులతో గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేసినప్పుడు ప్రజలు ధైర్యంగా ముందుకు వస్తె ఇలాంటి అసాంఘిక ఆధిపత్య శక్తులను కట్టడి చేసి వి.డి.సి లను నిర్మూలన చేయవచ్చని అన్నారు. రాజ్యంగేతర శక్తిగా తయారైన వి.డి.సి లు రాజ్యాంగ హక్కులను పక్కకు నెట్టి అక్రమ పాలన కొనసాగుస్తుంటే స్థానిక పాలకులు, ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారని అన్నారు. ప్రతి వృత్తి కులాల నుండి పెద్ద ఎత్తున డబ్బు వసూళు చేస్తున్నారని, అలాంటి హక్కు వారికి ఎక్కడిదని అన్నారు. ఆధిపత్యంతో గ్రామంలోని ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని, గతంలో పేదలకు కేటాయించిన భూములను సైతం వి.డి.సి నాయకులు గ్రామ అభివృద్ధి పేరుతో లాక్కుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎన్నో పోరాటాలకు నిలయమైన తెలంగాణలో ఇలాంటి సామాజిక దుర్మార్గాలు జరగడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇలాంటి దుర్మార్గాలు జరుగుతున్నా ఈ ప్రాంత నాయకులు ఏమి చేస్తున్నట్లని, ప్రజల ఓట్ల కోసం ఇల్లు ఇల్లు తిరిగే నాయకులు ఇలాంటి దౌర్జన్యాలు జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ ముందు భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ బట్టు, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాజేష్ రక్షక్, మాజీ సర్పంచ్ రామాగౌడ్,మాజీ ఎంపీటీసీ సుదర్శన్ , గౌడ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, నాయకులు లలిత, కళ్యాణి, సంతోష , మౌనిక, నారాగౌడ్, సత్యనారాయణ , శ్రీనివాస్ , పెద్ద గంగాధర్ , తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వ విద్యాలయం పరిశోధనలకు అనువైన ప్రదేశం మల్యాల

## రిజిస్టార్ డాక్టర్ ఏ భగవాన్



**తొలి సమయం మహబూబాబాద్ మే 12:**

మహబూబాబాద్ జిల్లా మల్యాల గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిశోధనల నిమిత్తం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి, హార్టికల్చర్ విశ్వవద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, డీన్ డాక్టర్ చీనానాయక్, సంబంధిత శాస్త్రవేత్తలతో పరిశోధనల తోటలను పరిశీలించారు, ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్ మాట్లాడుతూ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిశోధనలకు అనువైన ప్రదేశం మల్యాల గ్రామం అని, ఇక్కడ అధికంగా మామిడి, జామ, సపోటా, వాక్కాయ , పనస, తదితర ఉద్యాన పంటల పై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపినారు. అలాగే ఉద్యాన పరిశోధన స్థానం, మల్యాల ద్వారా వరంగల్ చపాటా మిరపకాయకు భౌగోళిక సూచిక (జి 1) ట్యాగ్ వచ్చింది. ఇది తెలంగాణలో 18వ ఉత్పత్తిగా (జి 1 )గుర్తింపు పొందినది. స్థానికంగా దీనిని 'టొమాటో మిరపకాయ' అని కూడా అంటారు. ఈ సందర్భంగా కలెక్టర్ హార్టికల్చర్ యునివర్సిటీ పరిశోధనలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు,ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి శ్రీ జినుగు మరియన్న, శాస్త్రవేత్తలు డాక్టర్ నాగరాజు, ప్రశాంత్, వేంకట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటం

## సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి - సిపిఐ జిల్లా మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

## మహాసభలకు హాజరు కానున్నా చాడ, తక్కళ్లపల్లి




**హసన్ పర్తి**

: జిల్లా సమగ్ర అభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, హసన్ పర్తి మండల కేంద్రంలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగే సిపిఐ జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. సోమవారం హసన్ పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా 2వ మహాసభల వాల్ పోస్టర్లను సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ జిల్లా ల పునర్విభజన చేసిన తర్వాత ఏర్పడ్డ హనుమకొండ జిల్లా పట్టణఈ నెల 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా 2వ మహాసభలు జరగబోతున్నాయని, జిల్లాలో నెలకొని ఉన్న ప్రజా సమస్యలపై చర్చిచెందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని, ఈ మహాసభల్లో మొదటి రోజు మే 26న ప్రజా ప్రదర్శన - బహిరంగ సభ ఉంటుందని, ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు లు హాజరు కానున్నారని తెలిపారు. ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మాలోత్ శంకర్, కొట్టె వెంకటేష్, దామెర సుదర్శన్, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు వస్కుల భరత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి పట్టణానికి నూతన విద్యుత్ వసతులు

## 4 నూతన ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం పాలకుర్తి మే 12**

పాలకుర్తి పట్టణంలో విద్యుత్ సరఫరా మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నాలుగు ట్రాన్స్ఫార్మర్లను పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి . ఈ రోజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు..ఈ ప్రారంభ కార్యక్రమంలో 25KVA DTRను ఫైర్ స్టేషన్ సమీపంలో, 63 %ఖవా% ట్రాన్స్ఫార్మర్లను బైపాస్ రోడ్డులో, పట్టణంలోని SC కాలనీలో, మరియు కార్మెల్ స్కూల్ వద్ద ప్రారంభించారు. ఈ ట్రాన్స్ఫార్మర్లు ఆయా ప్రాంతాల్లో అధికంగా ఉండే లోడ్‌ను తగ్గించి, నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు ఉపయోగ పడను న్నాయి..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వేసవి కాలంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఫ్యాన్‌లు, ఫ్రిడ్జ్‌లు, ఏసీలు వంటి ఉపకరణాల వాడకం పెరిగిన నేపథ్యంలో పాత ట్రాన్స్ఫార్మర్లు భరించలేక కరెంటు తేడాలు రావడం ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకుని మేము కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయించాము. తద్వారా ఓవర్‌లోడ్ సమస్యలు తగ్గి, నిరవధిక విద్యుత్ సరఫరా అందేలా చూస్తాం, అని పేర్కొన్నారు..తద్వారా ప్రజలకు తక్కువ వోల్టేజ్ సమస్యలు నివారించబడతాయని, విద్యార్థులు, విద్యుత్ ఆధారిత వ్యాపారాలు, మరియు ఇంటి వినియోగదారులందరికీ ఇది ఎంతో ఉపయుక్తంగా మారుతుందని ఎమ్మెల్యే గారు వివరించారు. అలాగే, త్వరలో మరిన్ని ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు..ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు ఎమ్మెల్యే ప్రయత్నాలను అభినందించారు..

# మే 20 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**తొలిసమయం, ఇల్లందు.మే, 12.**




కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు సంపూర్ణంగా పాల్గొని విజయవంతం చేయాలని ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, ఏ ఐ టి యు సి జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్, సిఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఏ.నబి, టి యు సి ఐ ఇల్లెందు ఏరియా కమిటీ అధ్యక్షులు పాయం వెంకన్న,బి ఆర్ టి యు ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జాఫర్ హుస్సేన్ పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందు ఐ ఎఫ్ టి యు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ రంగ పరిశ్రమల అమ్మకాలను ఆపాలని,కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని,కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్,స్కీమ్ వర్కర్లందర్నీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.మే 20న సార్వత్రిక సమ్మె విజయానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఎండి. రాసుద్దీన్,డి.ప్రసాద్, తోడేటి నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణ, బి ఆర్ టి యు నాయకులు బి. సత్యనారాయణ,లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలి

### శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 12**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లా ఎస్పీ కార్యాలయలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.పోలీస్ అధికారు లంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్ ను గుర్తించి గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు.ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.రాబోయే వర్షాకాలంలో అధిక వర్షాలు సంభవించినపుడు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే విధంగా ముందస్తుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి,భాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి మరియు జిల్లాలోని ఇన్స్పెక్టర్స్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాద్రి జిల్లా టిఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా రామిళ్ళ మధు మాదిగ



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 12**

కొత్తగూడెం టిఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజు మాదిగ ఆదేశాలతో పట్టణ బస్టాండ్ సమీపంలో టిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్ మాదిగ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామిళ్ల మధు మాదిగను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్‌పిఎస్ మాదిగ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి సంతోష్, టిఎంఆర్‌పిఎస్ భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు శ్రీకాంత్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్, నాయకులు బోయిని మహేందర్, డిఎంఆర్ చంద్రుగొండ మండల అధ్యక్షులు పెబ్బేందుల నరసరావు మాదిగ, డి మూర? ప్రసాద్, అనిల్, కాజా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ అధికారి

### రైతే దేశానికి వెన్నెముక జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 12**

సుజాతనగర్ మండల కేంద్రంలోని ధ్యానం కోనుగోలు కేంద్రానికి జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు సందర్శించారు వారు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక రైతులు కష్టపడి పండించిన ధాన్యంను తూర్పాలు తాలు,మట్టి రాళ్ళు లేకుండా పోసుకోవాలి అని తుఫాను ప్రభావం వల్ల రైతులు ఎప్పటికీ అప్రమత్తంగా ఉండాలని ధాన్యంలో తేమశాతం తగ్గుటకు ప్రతిరోజు ఎండబెట్టాలని సూచించడం జరిగింది. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్నటువంటి రికార్డ్స్ను కూడా పరిశీలించటం జరిగినది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నర్మద, టెక్నికల్ %ూాం% నాగయ్య, సాయి నారాయణ, విజయ్ భాస్కర్ రెడ్డి, %ూజూం% శరత్, ప్రనుష, నరసింహ, సెంటర్ ఇన్చార్జి సైదులు,శివ, మరియు రైతులు పాల్గొనారు.

# మహబూబాబాద్ లో ఎండు గంజాయి స్వాధీనం



**తొలి సమయం మహబూబాబాద్ మే 12:**

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, కురవి గేట్ ప్రాంతాలలో ఎండుగంజాయి రైళ్ళ ద్వారా సరఫరా చేస్తున్నారనే విశ్వసనీయసమాచారం మేరకు విస్తృత సోదాలు నిర్వహించారు. మహబూబాబాద్ లోని కురవి గేట్ రైల్వే ట్రాక్ సమీపంలోని చెట్లపొదలమాటున (02) తెల్లటి ప్లాస్టిక్ సంచులలో (60) కిలోల ఎండు గంజాయి గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరిగింది. మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, వరంగల్ ఎన్ఫోర్స్మెంట్ %డ ఋఖీ%- మహబూబాబాద్ సంయుక్తంగా సోదాలు నిర్వహించడం జరిగిందిఈ..సోదాలలో ఎక్సైజ్ సిఐ లు చిరంజీవి, నాగేశ్వర్ రావు, నీరజ, ఎస్ఐలు చంద్రశేఖర్,అశోక్, కిరీటి, హెడ్ కానిస్టేబుల్ లు శ్రీనివాస్,మధు కానిస్టేబుల్ లు రాజు,శ్రీను,శేఖర్, ఇబ్రహీం, భవాని, నర్సింహా రావు, రవి సుమన్ పాల్గొన్నారు.

# కులగణన ప్రతిష్ఠను కాజేసే కుట్రలు



**న్యూఢిల్లీ మే 12 :**
కేంద్ర కులగణన నిర్ణయం రాహుల్‌గాంధీ పోరాట ఫలితమే అని దేశమంతా కీర్తించింది. ఇది బీజేపీ నేతలకు మింగుడుపడక అడ్డగోలు వాదనలు చేస్తున్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ మే 3న ఆంధ్రజ్యోతిలో 'చరిత్రాత్మకం... మోదీ కులగణన నిర్ణయం' పేరుతో రాసిన వ్యాసంలో అట్టడుగు వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలును పూర్తిగా వక్రీకరించారు. కులగణన చేస్తామని 2024 లోకసభ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొన్నది. 'జిత్‌నీ ఆబాదీ ఉత్‌నా హక్' (జనాభా ఎంతో అంత వాటా) అని రాహుల్‌గాంధీ మోదీ ప్రభుత్వానికి పక్కలో బల్లెంలా తయారయ్యారు. కులగణన వాదాన్ని బలపరిచారు. మోదీ మాత్రం కాంగ్రెస్ పార్టీ కులగణనను సమర్థించటాన్ని అర్బన్ నక్సలిజంతో పోల్చి విమర్శించారు. కులగణన హిందువుల మధ్య విభజన తెస్తుందన్నారు. "ముందు నీ కులమేంది? నీ మతమేంది?" చెప్పు అని బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీని అవమానించారు. బీజేపీ నేతలు ఎంత అవమానపరిచినా రాహుల్ కులగణన వాదాన్ని వీడలేదు. దేశంలో ఆయనకు పెరుగుతున్న ఆదరణను చూసి కులగణనకు వ్యతిరేకంగా వెళితే బీజేపీ పార్టీకి భవిష్యత్‌లో జరిగే బిహార్, గుజరాత్ తదితర ఎన్నికల్లో పుట్టగతులుండవని గ్రహించి, కులగణన చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. కులగణన ఘనత తమదేనని డాక్టర్ లక్ష్మణ్ తన వ్యాసంలో సొంత డబ్బా కొట్టుకున్నారు. భారతదేశంలో సామాజిక న్యాయానికి ఇప్పటికీ ఎప్పటికీ దిక్సూచి ఐన కాంగ్రెస్ పార్టీ పట్ల విషం కక్కారు. మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1953లో కాకా కాలేల్కర్ చైర్మన్‌గా 11 మంది సభ్యులతో తొలి బీసీ కమిషన్ వేశారు. 1951 జనాభా లెక్కల ప్రకారం 36.11కోట్ల జనాభా ఉంటే ఆ కమిషన్ కేవలం 11.5కోట్ల మంది నుండి సమాచారం సేకరించి నివేదిక రూపొందించింది. కమిషన్ వెనుకబడిన తరగతులను గుర్తించటంలో ఎటువంటి శాస్త్రీయ విధానాలు పాటించలేదని ఆ నివేదికను తోసిపుచ్చటం జరిగింది. ఇందులో నెహ్రూ తప్పు లేదు. 2011లో దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం జనాభా లెక్కల్లో భాగంగా సామాజిక, ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి) చేసింది. నివేదిక వచ్చే సమయానికి 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కులగణన లెక్కలను బయటపెట్టాలని కాంగ్రెస్ ఎంపీలు నిలదీసినా మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి మోదీకి 2024 పార్లమెంటు ఎన్నికల ముందు 2011 కులగణన లెక్కలు బయటపెట్టాలని లేఖ రాసినా ఎందుకు బయటపెట్టలేదో ఎంపీ లక్ష్మణ్ సమాధానం చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కార్ చేసిన కులగణనను లక్ష్మణ్ ఉద్దేశపూర్వకంగా తప్పుపడుతున్నారు. రెండు దశల్లో చేపట్టిన సర్వేలో 97.10 శాతం జనాన్ని సమీకరించి 57 ప్రశ్నలతో సమర్థవంతంగా సమాచారం సేకరించి తెలంగాణ కులగణనలో బీసీలు 46.25 శాతం అని లెక్కలు తేల్చారు. తరువాత బీసీ జాబితాలో చేర్చిన ముస్లింల జనాభా 10.8 శాతంగా లెక్కించారు. బీసీలను, ముస్లిం బీసీలను కలిపితే తెలంగాణలో మొత్తం బీసీల శాతం 56.33గా పేర్కొన్నారు. ఎస్సీలు 17.43శాతమని, ఎస్టీలు 10.45శాతమని ప్రకటించారు. మొత్తం ఓసీల జనాభా 13.31శాతం అని వెల్లడించారు. ఓసీ ముస్లింలు 2.48శాతం. ఓసీలు, ఓసీ ముస్లింలతో కలిపి తెలంగాణలో మొత్తం ఓసీల జనాభా 15.79శాతంగా స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేసిన సర్వేలో శాస్త్రీయత స్పష్టంగా ఉన్నది. నిజానికి దేశంలో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించటానికి 1989%-%1990లో మాజీ ప్రధాని వి.పి.సింగ్ ప్రయత్నిస్తే 'మండల్ కమండల్' పేరుతో యాత్రలు చేసి, అల్లర్లు సృష్టించి వి.పి.సింగ్ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుని ప్రభుత్వాన్ని పడగొట్టిన సంస్కృతి బీజేపీది. ఈ సంగతి మర్చిపోయినట్టు రాజీవ్‌గాంధీ మీద ఆ నేరాన్ని డాక్టర్ లక్ష్మణ్ మోపారు. ఆ తరువాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పీవీ నరసింహారావు ప్రధానిగా దేశవ్యాప్తంగా ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది నిజం కాదా లక్ష్మణ్ గారు? 2006లో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి కేంద్ర అత్యున్నతమైన విద్యాసంస్థల్లోను, కేంద్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లోను ఓబీసీలకి 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసింది యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌లు అన్న సంగతి మర్చిపోతే ఎలా? బిహార్‌లో కులగణన అప్పటి ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన జేడీయూ, ఆర్‌జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ల సమక్షంలో 2022 నుండి ప్రారంభమై 2023లో నివేదిక బైటపెట్టింది. దీన్ని కూడా లక్ష్మణ్ బీజేపీ ఖాతాలో వేసుకోవడం విచిత్రం. కె.లక్ష్మణ్ గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే ఈ దేశంలో తొలి బీసీ కమిషన్ వేసి, ఎస్సీ ఎస్టీ బీసీలకు ముమ్మాటికి న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. రాష్ట్రంలో బీసీలుగా ఉన్న లంబాడీలను 1975లో ఎస్టీ జాబితాలో చేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలే. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణను అమలు చేసిన తొలి ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమే. 42శాతం విద్య ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి సర్కారే. నిజంగా మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే రాహుల్‌గాంధీ చెప్పినట్లు 50శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేసి శాస్త్రీయంగా జనగణనతో పాటు కులగణన చేసి దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న వారి వాటాను వారికి పంచండి.

# యుద్ధం శాంతి..



**న్యూఢిల్లీ మే 12 :**
భారత్-పాకిస్థాన్‌ల మధ్య నాలుగు రోజులపాటు సాగిన సాయుధ సంఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారకముందే ముగిసింది. ఘర్షణ ఆగిపోవడం, హింసకు తెరపడడం సంతోషమే అయినా అది జరిగిన తీరు మాత్రం తీవ్ర చర్చకు, అనుమానాలకు దారితీసింది. పాక్ ఉగ్రవాదులు, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఏప్రిల్ 22న పహల్గాంలో భారత టూరిస్టులను వారి భార్యాబిడ్డల ముందు దారుణంగా కాల్చిచంపిన సంఘటన ప్రపంచాన్ని కుదిపేసింది. లష్కరే తోయిబా నుంచి విడివడిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే నిషేధిత సంస్థకు చెందిన ఈ టెర్రరిస్టులకు పాక్ అన్ని రకాల సహాయ సహకారాలు అందించినట్లు భారత్ ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. దీనిపై అట్టుడికిన భారత్ మే 7న పాకిస్థాన్, ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై లాంగ్‌రేంజ్ ఆయుధాలతో దాడులు చేసింది. దానికి పాక్ ఊరుకోకుండా ఎదురుదాడికి దిగడంతో భారత్ కూడా స్పందించి గట్టిగా తిప్పికొట్టింది. భారత్ దాడుల్లో పాక్ సైన్యానికి బలమైన ఎదురుదెబ్బలు తగలడంతో పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ అణ్వస్త్ర నేషనల్ కమాండ్ అథారిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇది అణు యుద్ధానికి దారితీస్తుందనే ఆందోళన మొదలైంది. ఆ దశలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుంచి అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వెలువడింది. ఆ తర్వాత కాసేపటికి కాల్పుల విరమణను ధ్రువీకరిస్తూ భారత్ కూడా ప్రకటన విడుదల చేసింది. "నిర్ణీత లక్ష్యాలేవీ సాధించకుండా, పాక్ నుంచి ఎలాంటి హామీలూ పొందకుండా కాల్పుల విరమణకు అంగీకరించడం ఏమిటి? అది కూడా ట్రంప్ దీనిని ప్రకటించడం ఏమిటి?" అంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన ప్రశ్నలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. కొందరు బీజేపీ మద్దతుదారులు సైతం ఈ విషయంలో మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. పైగా ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ రెండు గంటల్లోనే భారత్‌పై దాడికి దిగడంతో ఈ విమర్శలు మరింత తీవ్రమయ్యాయి. చివరికి కాల్పులు ఆగిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తోను, పాక్ ప్రధాని షరీఫ్‌తోను అమెరికా విదేశాంగ మంత్రి రూబియో గత శుక్రవారం చర్చలు జరిపారు. దీంతో కాల్పుల విరమణ కోసం అమెరికా ప్రయత్నాలు చేస్తోందని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత కాసేపటికే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మాట్లాడుతూ భారత్, పాక్ వివాదంతో అమెరికాకు సంబంధం లేదని, తాము అందులో జోక్యం చేసుకోబోమని ప్రకటించారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే తమ మధ్యవర్తిత్వం వల్ల రెండు దేశాలూ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు శనివారం ట్రంప్ ప్రకటన వచ్చింది. 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ చెప్పిన కాసేపటికే పాక్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. దీంతో ఏం జరుగుతోందనే ఆందోళన అందరిలో కలిగింది. కానీ తుదకు అన్నీ సర్దుకున్నాయి. ఘోరమైన ఉగ్రవాద దాడి మనస్సుల్ని కాలుస్తున్నప్పుడు కాల్పుల విరమణ అందరికీ సంతృప్తి కలిగించకపోవచ్చు. కానీ ఈ యుద్ధం ద్వారా భారత్ కొన్ని లక్ష్యాలను నెరవేర్చుకుందనే చెప్పాలి. తొలిరోజు దాడుల్లోనే పాక్‌లోని అనేక ఉగ్రవాద శిబిరాల్ని, వారి మౌలిక సదుపాయాల్ని భారత్ ధ్వంసం చేసింది. పలువురు కీలకమైన ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. అలాగే అణ్వస్త్ర దాడి చేస్తామనే బెదిరింపుల్ని లెక్క చేయబోమని, పాక్ మరోసారి ఉగ్రవాద దాడికి పాల్పడితే యుద్ధమే మా సమాధానమని పాక్‌కే కాదు, ప్రపంచానికి కూడా గట్టి సందేశం ఇచ్చింది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత జరిగిన బాలాకోట్ దాడులు ఆరేళ్లపాటు పాక్ భారీ ఉగ్రదాడులకు పాల్పడకుండా నిరోధించగలిగాయి. ఇప్పుడు భారత్ మరింత తీవ్రంగా స్పందించడంతో ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విషయంలో భవిష్యత్తులో పాక్ ఒకటికి పదిసార్లు ఆలోచించుకోక తప్పదు. పాక్ యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడినా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో వాటిని కూల్చడం ద్వారా భారత్ తన సత్తా చాటింది. భారత్ కూడా కొన్ని యుద్ధ విమానాలను కోల్పోయినట్లు వార్తలు వస్తున్నప్పటికీ యుద్ధంలో కొన్ని నష్టాలు సర్వసాధారణమే.ఏ యుద్ధమైనా శాంతితోనే ముగియాలి. ఇది కూడా అంతే! యుద్ధం చేసే సైనికుడికే శాంతి విలువ తెలుస్తుంది. "మంచి యుద్ధమూ, చెడు శాంతీ ప్రపంచంలో లేవు" అన్నాడు బెంజమిన్ ఫ్రాంక్లిన్.

## పహల్గాం కుట్రదారులను చంపారా

**భద్రతా వైఫల్యానికి బాధ్యులెవరు**

**పార్లమెంటు ప్రత్యేక భేటీ ఎందుకు పెట్టరు**

**ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్న కాంగ్రెస్**



**న్యూఢిల్లీ/తిరువనంతపురం, మే 12:**
పహల్గాంలో ఉగ్రవాదుల దాడి కుట్రదారులను అరెస్టు చేయడం గానీ, చంపేయడం గానీ చేశారా అని కేంద్రాన్ని కాంగ్రెస్ ప్రశ్నించింది. 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఘటనకు సంబంధించి భద్రతావైఫల్యానికి బాధ్యులెవరని నిలదీసింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేస్తున్నారో లేదో చెప్పాలని అడిగింది. ద్వైపాక్షిక అంశమైన కశ్మీరుపై దేశం వైఖరి మారిందా.. మూడో దేశం జోక్యంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. సోమవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బఘేల్ ఢిల్లీలో, మరో జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తిరువనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. భారత్-పాక్ కాల్పుల విరమణను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం మన దౌత్య వైఫల్యం కాదా అని నిలదీశారు. తాజా పరిణామాలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను గానీ, అఖిల పక్ష సమావేశాన్ని గానీ ఎందుకు ఏర్పాటుచేయడం లేదని బఘేల్ ప్రశ్నించారు. ఇకపై ప్రధాని మోదీ రాకుంటే తమ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అఖిల పక్షానికి రారని స్పష్టంచేశారు. కశ్మీరు అంశంపై మూడో పక్షం జోక్యానికి భారత్ సిద్ధంగా ఉందా అని వేణుగోపాల్ ప్రశ్నించారు. అదే జరిగితే సిమ్లా ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లవుతుందన్నారు.

## 32 విమానాశ్రయాల్లో సర్వీసులు మొదలు

**ఆపరేషన్ సిందూర్‌తో 7 నుంచి ఆగిన రాకపోకలు**



**న్యూఢిల్లీ, మే 12:** పాక్‌తో కాల్పుల విరమణ నేపథ్యంలో ఉత్తర, పశ్చిమ భారత్ ప్రాంతాల్లోని 32 విమానాశ్రయాల తాత్కాలిక మూసివేతను ఎత్తేస్తున్నట్లు భారత విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ) సోమవారం ప్రకటించింది. ఈ విమానాశ్రయాల్లో పౌర విమానాల రాకపోకలు తక్షణం ప్రారంభమవుతాయని పేర్కొంది. ఇండిగో, స్పైస్‌జెట్ సహా పలు ప్రధాన విమానయాన సంస్థలు కూడా విమాన సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాయి. ఏఏఐ ఆదేశాల నేపథ్యంలో విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టుల అధికారులు విమాన సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం నుంచి 24 విమానాశ్రయాల పరిధిలో విమానాల రాకపోకలపై ఏఏఐ ఆంక్షలు విధించింది. శనివారం దాన్ని 32 ఎయిర్‌పోర్టులకు విస్తరించింది. శ్రీనగర్, చండీగఢ్, అమృత్‌సర్, జై సల్మేర్, జోధ్‌పూర్, పఠాన్‌కోట్, లేహ్, రాజ్‌కోట్, పోర్ బందర్ తదితర 32 విమానాశ్రయాల పరిధిలో తాత్కాలికంగా విమాన సర్వీసులు రద్దు చేశారు.

## సెకీ సీఎండీ గుప్తాపై కేంద్రం వేటు

**- మరో నెల గడువు ఉండగానే తొలగింపు**

**- కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ - కార్యదర్శి సారంగికి అదనపు బాధ్యతలు**

న్యూఢిల్లీ, మే 12: భారత సౌర శక్తి కార్పొరేషన్(సెకీ) చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ రామేశ్వర్ ప్రసాద్ గుప్తాను కేంద్రం తొలగించింది. ఆయన స్థానంలో కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ కార్యదర్శి సంతోష్ కుమార్ సారంగికి సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ సోమవా రం నిర్ణయం తీసుకుంది. గుప్తా గుజరాత్ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి. 2023 జూన్‌లో సెకీ సీఎండీగా బాధ్యతలు చేపట్టారు. మరో నెలలో ఆయన పదవీకాలం ముగియనుంది. ఈలోపే ఈ నెల 10న ఆయనపై వేటు వేయడం గమనార్హం. ఆయన్ను తొలగించడానికి కారణాలేంటో ప్రభుత్వం పేర్కొనలేదు. అయితే అదానీ స్కాంతో ఈ నిర్ణయానికి సంబంధం ఉందని కాంగ్రెస్ ఆరోపించింది.ఇలాంటి చర్యలతో కుంభకోణాన్ని దాచిపెట్టలేర ని స్పష్టంచేసింది. అదానీ, ఆయన సహచరులపై అమెరికా అధికారులు చార్జిషీటు దాఖలుచేశారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గుర్తుచేశారు. అందులో సెకీ కూడా ఉందన్నారు. కాగా.. నాటి ఏపీ సీఎం జగన్ హయాంలో సెకీతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101